

# భవానీద్వీపం

## -వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 66 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

ప్రభవ నామ సంవత్సరం – ఆశ్వయుజ బహుళ సప్తమి – సోమవారం – 13/10/1687 –

### నాగులవంచ

'నాగులవంచ డచ్చివాడి తాతగారి జాగీరా?' నాగులు కంఠం ఆవేశంతో ఖంగున మోగింది. కాదు కాదు అన్నట్లు తలలూపుతూ పిడికిళ్ళు గాలిలోకి విసిరి నాగులుకు మద్దతు తెలిపారు చుట్టూతా  కూర్చున్న యువకులు వందలమంది. నాగులు కళ్ళు మండుతున్న కొరకంచుల్లా ఉన్నాయి. పదెకరాల మామిడి తోటలో పట్టు కుచ్చుల్లా ఆకుల సందుల్లోంచి ఉదయకాలపు లేత ఎండ మెరుస్తున్నది.

'నా భూమిలోకి నేను అడుగు పెట్టొద్దు అనడానికి వాడెవ్వడు? వేలమంది మధ్యన నా నాగమణిని ఒక వేశ్యలా నిలబెట్టిన వాళ్ళను నిలువునా నరకకపోతే నేను మగాడినా?' రోషంతో గుండెలు చరుచుకుంటూ చేతిలోని బరిసెను నేలకు తాటించాడు నాగులు. అలుముకున్న నిశ్శబ్దాన్ని ఒక్కసారిగా భగ్నం చేసింది నాగమణి కంఠధ్వని. నాలుగు రోజులనుండీ అదిమి పెట్టుకున్న అవమాన భారం బద్దలైన కన్నీళ్ళ కుండలా భళ్లుమన్నది. ఆమె తల మీద చేయి వేసి లాలనగా నిమురుతూ ఓదార్చాడు ఆమె తండ్రి భద్రుడు.

విచారణ జరిగిన రోజున అతడు నాగులవంచలో లేడు. ముత్తవరం అంగడి వద్ద ఏర్పాట్లలో ఉన్నాడు.

గత వారం రోజులుగా కుతకుత లాడుతున్న అగ్నిపర్వతంలా ఉన్నది నాగులవంచ. అది ఏ క్షణంలోనైనా బద్దలు కావడానికి సిద్ధంగా వున్నది.

వారం రోజుల క్రితం నాగులు ఉదంతం జరిగింది. లూసిఫర్ నాగులు చేతిలో చావు అంచులదాకా వెళ్ళాడు.

యువకుల గుంపు చేతులలో బీల్జిబబ్ అదే పరిస్థితిలో వున్నాడు. నాగులు తండ్రి గోపులు వాళ్ళ ప్రాణాలకు అడ్డుపడ్డాడు. ముందు తనను చంపి గానీ వోలందుల( హాలండ్/డచ్చి) అధికారుల జోలికి వెళ్లొద్దు అని కొడుకుతో పెనుగులాడాడు. పెడరెక్కలు, వెన్ను విరిగినట్లు పడి, లేవలేకపోతున్న లూసిఫర్ మీద అడ్డంగా పడిపోయాడు ఆచ్ఛాదనలా. ఆ ముసలాడి చలవతో ఆరోజు బతికి బయట పడ్డారు లూసిఫర్, బీల్జిబబ్.

సంఘటన ఘర్షణగా మారుతున్న వెంటనే 'అంబ్రాస్'కి ఆఘమేఘాల మీద వర్తమానం వెళ్ళింది. మూడు ఘడియలలో అక్కడికి చేరుకున్నాడు అంబ్రాస్. అతడిని చూస్తూనే పక్కకు తొలిగి దారిని యిచ్చారు కోట గోడలా చుట్టూ మూగిన శ్రామికులు. తండ్రి మొండికేయడంతో లూసిఫర్ ని వదిలి నీలి తొట్టి మీద కూర్చున్న నాగులు కనిపించాడు అంబ్రాస్ కనులకు. ఇద్దరేసి మనుషుల ఊతంతో అతి కష్టం మీద లేచి నిలబడుతున్న తన సహోద్యోగులను చూశాడు.

ప్రశాంతంగా జరిగినది మొత్తం ప్రారంభం నుండి వివరంగా అడిగి తెలుసుకున్నాడు అంబ్రాస్. నాగులు గాయాలకు నొచ్చుకున్నాడు. స్థావరంలో ఉండే వైద్యులను రప్పించాడు. నాగులుకు ప్రాథమిక చికిత్స చేయించాడు. నాగులు తండ్రికి నమస్కరించి మన్నించాల్సిందిగా కోరాడు. జరిగినదానికి విచారాన్ని వ్యక్తం చేశాడు నాగులుతో. ఇంకా ఆడ త్రాచులా బుసలు కొడుతున్న నాగులు ప్రియురాలిని అనునయంగా శాంత పరిచాడు. అక్కడ ఉన్న అందరినీ జరిగినదాన్ని మనసులో పెట్టుకోకుండా మరిచిపోవాల్సిందిగా మళ్ళీ మళ్ళీ ప్రాధేయపడ్డాడు.

అంతవరకూ జరిగిన అవమానం కన్నా అది ఎక్కువగా బాధించింది 'లూసిఫర్'ను, 'బీల్జిబబ్'ను. మొదటినుండీ వారిద్దరికీ అంబ్రాస్ అంటే వున్న ద్వేషం యిప్పుడు వందల రెట్లు పెరిగింది. వారికి నాగులుతో సమానంగా

శత్రువైనాడు అంబ్రాస్. అంబ్రాస్ సాత్వికుడు. వారి గురించి అంతా తెల్సినా వారిని ఓదార్చడానికి, అనునయంగా నచ్చ చెప్పడానికి ప్రయత్నించాడు. బెదిరించి, భయపెట్టి ఎవరితోనూ ఏమీ చేయించలేము అని మొదటినుండీ వారికి చెబుతూనే వున్నాడు తను. అతను ఊరడించిన కొద్దీ, సానుభూతిని చూపించిన కొద్దీ మరింత గాయపడినట్లు బాధపడ్డారు లూసిఫర్, బీల్జిబబ్. అదేమీ తను పట్టించుకోకుండా వారిద్దరినీ స్థావరానికి చేర్పించి అత్యవసర చికిత్స చేయించాడు అంబ్రాస్.

హైదరాబాద్, బందరు వెళ్ళిన తన పై అధికారులిద్దరికీ వర్తమానం పంపించాడు. మరునాడు సాయంత్రానికల్లా హైదరాబాదులో ఉన్న 'అప్పర్ హుడ్'కి, బందరులో ఉన్న 'సికందర్'కి వార్త తెలిసింది. మిగిలిన పనులన్నీ మానుకుని, తమ సైనికులతో వెనక్కు బయలుదేరారు వాళ్ళు. మరునాడు సాయంత్రానికల్లా స్థావరానికి చేరుకున్నారు. ఆ మరునాడు ప్రత్యేక విచారణ చేపట్టారు పై అధికారులిద్దరూ.

వేలాదిమంది 'స్లాఫ్ వార్కేన్స్' (బానిస పందులు) ఎదుట డచ్చి జాతిని మొత్తాన్ని అంబ్రాస్ అవమానించాడని కూడబలుక్కుని వాంగ్మూలం ఇచ్చారు లూసిఫర్, బీల్జిబబ్. నాగులు తను పని చేయకుండా, చేసే వారిని చేయనీయకుండా అడ్డు పడ్డాడని ఆరోపించారు. బహిరంగంగా శృంగారభావ ప్రకటనతో నాగులు, అతడి ప్రియురాలు నాగమణి అసభ్యంగా ప్రవర్తిస్తే కేవలం అదుపు చేయడానికి తాను ప్రయత్నం చేశానని చెప్పాడు లూసిఫర్. తన మీద దాడి చేయడానికి ప్రయత్నం చేయడం వల్లనే బీల్జిబబ్ తుపాకీ ఎక్కుపెట్టాడని, తను కఠినంగా శిక్షించాల్సివచ్చిందనీ పదే పదే తన వాదన వినిపించాడు. ఇలాంటి తిరుగుబాటు, తీవ్రవాద ధోరణి వలన డచ్చివారి స్థావరానికి, వారి ఉనికికే ప్రమాదం అని చెప్పారు.

సహజంగా ముగ్గురి పని తాను ఒక్కడే చేసే కష్ట జీవి నాగులు అని తన అభిప్రాయాన్ని చెప్పాడు అంబ్రాస్. నాగమణి అతడికి కాబోయే భార్య అని, నలుగురి ఎదుటా అసభ్యంగా ప్రవర్తించే యువతి కాదు అని చెప్పాడు. ఆనాటి ఉద్రిక్తతకు దారి తీసిన పరిస్థితులు తనకు ప్రత్యక్షంగా తెలియవు అని చెప్పాడు. వార్త తెలిసి తను వచ్చేప్పటికి ఏం జరుగుతున్నదో, తను విచారించి ఏం తెలుసుకున్నాడో అంతవరకే చెప్పాడు అంబ్రాస్. క్రూరంగా, అకారణంగా నాగులును ఘోరం హింసించినట్లు చెప్పాడు. నాగులు కనుక తట్టుకున్నాడు, వేరే ఎవరైనా అయితే ఆ దెబ్బలకు ప్రాణాలే పోయేవి అని చెప్పాడు. నాగులు తండ్రి గోపులు అడ్డు పడకపోతే తను వచ్చేప్పటికే తన సహోద్యోగులిద్దరి ప్రాణాలు పోయి ఉండేవి అని చెప్పాడు.

విచారణ ముగిసిన తరువాత నివేదికను భారతదేశంలో డచ్చివారి ప్రధాన కేంద్రమైన 'పులికాట్'కి వెంటనే పంపనున్నట్లు తెలిపాడు 'అప్పర్ హుడ్'. సమాచారాన్ని వారి ప్రధాన వర్తక కేంద్రమైన మచిలీపట్నానికి కూడా పంపించాడు. మచిలీపట్నం స్థావరం నుండి రక్షణ కోసం అదనంగా రెండువేల మంది సైనికులను నాగులవంచ

పంపాలని అభ్యర్ధన కూడా పంపాడు అప్పర్ హుడ్. విజయదశమి లోపు జరిగిన సంఘటనపై తీర్పు వెలువడుతుందని చెప్పాడు. నాగులవంచ ఉద్రిక్త పరిస్థితులకు కారణమైన రెండు వర్గాల మీద ఆంక్షలు విధించారు.

నాగులు, గోపులు, నాగమణి, మరొక నలుగురిని పని నుండి తాత్కాలికంగా తొలగించినట్లు ప్రకటించారు. వారికి ఇవ్వ వలసిన వేతనాన్ని తీర్పు వచ్చేదాకా నిలిపివేశారు. వారు డచ్చివారికి తాకట్టుపెట్టిన భూమిలోకి తీర్పు వచ్చేదాకా అడుగు పెట్టడానికి వీలు లేదని ఆజ్ఞ జారీ చేశారు. పరిస్థితి విషమించడానికి లూసిఫర్, బీల్జిబబ్ కూడా కారణం అని అభిప్రాయపడ్డారు. అందువలన, కోరమాండల్ నుండి నిర్ణయం  వచ్చేంత వరకూ లూసిఫర్, బీల్జిబబ్ లను స్థావరంలోని కార్యాలయానికే పరిమితం చేసినట్లు వెల్లడించారు. అంటే వారిద్దరి అధికారాన్ని తగ్గించడమే కనుక సమాన న్యాయం జరిగినట్లు భావించారు అందరూ.

లోలోపల రగులుకుంటున్న మంటలా చుట్టుపక్కల పదకొండు ఊళ్ళ ప్రజలను సమీకరించడం మొదలు బెట్టాడు నాగులు ఈ నాలుగు రోజులలో. యాభై వేల ఎకరాల పంట భూములను డచ్చివారికి తాకట్టు పెట్టి బానిసలైన యజమానులు వాళ్ళు అందరూ. తిండి గింజలను అద్దకం బట్టల కోసం పారబోసుకున్నామన్న ఆవేదనలో ఉన్నవాళ్ళు వాళ్ళందరూ. గాదెల కొద్దీ ముంగిళ్ళలో ఉన్న ధాన్యం తరిగిపోయి తిండికి చాలినంత ఉంటే చాలు అనే స్థితికి వచ్చిన ఊళ్లు అవి. వడ్ల గుమ్ముల స్థానంలో వోలందులోళ్ళ అద్దకం బట్టల మూటలు ముంగిళ్ళలో వెలసిన ఊళ్లు అవి.

'మనమే మాట ఇచ్చాం!' నాగులు తండ్రి ఏదో సర్ది చెప్పబోయాడు.

'అవును! మనమే మాట ఇచ్చాం. భూమిని, భుక్తిని, మానాన్ని తాకట్టు పెడుతున్నామని మాట ఇచ్చాం. చుట్టూ చల్లని తల్లులు పదకొండు చెరువులున్న మాగాణాన్ని కుత్తుక తెగ కోసి పత్తినే పండిస్తామని మాట ఇచ్చాం. వోలందులోళ్ళ అత్తరు, పన్నీటి బుడ్లకు అంగలార్చుకుంటామని మాట ఇచ్చాం. చొంగలు కార్చుకుంటూ తోకలూపుకుంటూ వెంట తిరుగుతామని మాట ఇచ్చాం'  ఆవేశంతో రగులుతున్న అగ్ని జ్వాలలా చిర చిరలాడాడు నాగులు.

మౌనంగా తలలు దించుకున్నారు కొందరు. ఆవేశంతో బుసలు కొట్టారు యువకులు. 'జరిగిన దాంట్లో నీదీ తప్పుంది. ఆవేశం తగ్గించుకోరా అయ్యా అంటే వినవైతివి! అయినా వాళ్ళ అధికారులను ఏమీ వెనకేసుకోరాలేదుగా. వాళ్ళ హోదా తగ్గించి కూర్చోబెట్టారుగా' అని ఒక్క నిముషం ఆగాడు గోపులు.

'మన పంట భూములను మనమే కుదువ బెట్టుకున్నాము. మన పంటలకు తగిన పైకం ముడుతూనే ఉన్నది కదా' అని కొనసాగించబోయాడు.

'కుదువ పెట్టడం కాదు' కంచు గంటలా మోగింది నాగులు కంఠం. 'తెగనమ్ముకున్నట్లుగా తెలివిగా రాయించుకున్నారు. గొర్రెల్లాగా పోటీలు పడి నిశానీలు పొడిచాం! దుబాసీ పంతులయ్యను అడగండి నా మాటల మీద నమ్మకం లేకుంటే'. తోట మొత్తం హాహాకారాలు చెలరేగాయి.

ఆవేశంగా లేచి 'వోలందుల బొంద పెట్టి మన భూములు మనం తీసుకుందాం. ఇక సమావేశాలు చర్చలు అనవసరం' అంటూ వూగిపోయాడు జగన్నాధపురం మొండి జగ్గడు. నడిచొచ్చే వడ్ల గుమ్మిలా ఉంటాడు మొండి జగ్గడు. పందెం కట్టి రెండు చంకల్లో రెండేసి వడ్లబస్తాలు ఇరికించుకుని స్థంభాద్రి నరసింహుడి గుట్టను ఎక్కిన సార్ధక నామధేయుడు. 'అంతే అంతే' అంటూ లేచి నిల్చున్నారు సగం మంది. అందరూ యువకులే, పూనకం వచ్చినట్లు ఊగిపోయారు. వాళ్ళందరినీ శాంతింపజేసి, కూర్చోబెట్టి, సద్దుమణగడానికి ఘడియసేపు బ్రహ్మప్రళయమైంది.

'ఈ ఒక్క వారం రోజులు ఓపిక పట్టండి. నా మాట వినండి. విజయదశమి నాటికి పైనుంచి తీర్పు వస్తుంది అని మాటిచ్చారు కదా. బాణా కర్రలు, బరిశెలతో తుపాకీలకు ఎదురు పోలేమురా..' రుద్ధమైన కంఠంతో రెండు చేతులూ జోడించాడు గోపులు.

'ఎంత అమాయకుడివి!' అన్నట్టు నవ్వాడు నాగులు. వెనక్కు తిరిగి పెద్దగా పిలిచాడు. తోట మొగదల కంచె దగ్గర కాపలా ఉన్న ఐదుగురు యువకులు కదిలారు. వారి స్థానాలను భర్తీ చేశారు అంతవరకూ తోటలో కూర్చున్న వారిలో ఐదుగురు యువకులు. నాగులు వద్దకు వచ్చి దుస్తుల లోపలినుండి ఒక పట్టు దొంతర బయటకు తీశాడు వారిలో ఒక యువకుడు. వెంటనే దాన్ని గుర్తు పట్టాడు గోపులు. విచారణ జరిపిన తరువాత పంపిన నివేదిక అది. ఆనాడు అందరి సమక్షంలో దాన్ని అందుకుని మచిలీపట్టణం గుండా నౌకలో పులికాట్ అధికారులకు అందించడానికి తీసుకువెళ్ళాడు డచ్చి సైనికుడు.

దాన్ని అందుకుని అందరికీ కనిపించేట్లుగా చూపిస్తూ 'విచారణ నివేదిక! తీర్పు కోసం పంపిన నివేదిక అని చెప్పారే, ఆ నివేదిక! నివేదికలో ఏమున్నదో తెలుసా? తెలుసా?' రెట్టించి అడుగుతూ కలయ జూశాడు నాగులు. తండ్రివైపు తిరిగి మరలా అడిగాడు 'నివేదిక! ఏమున్నదో తెలుసా?' తోటలో మౌనం అలుముకున్నది. చిరుగాలులకు ఆకులు కదులుతున్న ధ్వని తప్ప అంతా నిశ్శబ్దం. 'నువ్వు చదువు పెద్దయ్యా' అంటూ ఒక వృద్ధుడికి దాన్ని అందించాడు నాగులు. ఆ వృద్ధుడు నామవరం గ్రామ పెద్ద.

'పైన డచ్చిభాషలో వ్రాసి ఉన్నది' అంటూ 'దాని కింద.. తర్జుమా చేసినవారు..'అని చదవ బోతుండగా 'ఆ పేరు వద్దులే పెద్దయ్యా.. ఆ పేరు బయటకు రానియ్యనని ప్రమాణం చేశాను. మిగిలిన వివరాలు చదివితే చాలు' అని అడ్డు పడ్డాడు నాగులు.

'అక్టోబర్ 9 గురువారం, 1687 నాగలవంచ .. ఇందువెంట విడిగా జతపరచబడిన విచారణ నివేదికను అనుసరించి – నాగులవంచ డచ్చి స్థావర అధ్యక్షం పర్యవేక్షణాధికారులైన గౌరవనీయులు, సోదరులు లూసిఫర్, బీల్జిబబ్ ల మీద సాయుధ తిరుగుబాటు, హత్యాప్రయత్నం, డచ్చి ఆస్తుల దోపిడీ ప్రణాళికను రచించి, అందుకు ప్రయత్నించిన నాగులు, నాగమణి (స్త్రీ), రాముడు, గోవిందుడు, వెంకన్న, సాంబడు అనే దోషులకు అత్యున్నత శిక్ష (మరణ శిక్ష) సరి ఐనది అని విచారణాధికారులమైన, ఈ క్రింద సంతకం చేసిన, నాగులవంచ స్థావర ప్రధాన అధికారి ఐన 'నికొలాస్ డాన్కర్ వుడ్' మరియు ఉప పాలనాధికారి ఐన 'గేరార్ద్ బెనూర్దేన్' అనే మేము అభిప్రాయ పడుతూ తమరి నిర్ణయం కొరకు సమర్పించుకొన నైనది.

అభ్యర్ధన: నాగులవంచ స్థావర రక్షణ కొరకు అదనపు బలగాల అవసరము ఉన్నది కనుక మచిలీపట్నం నుండి రెండువేలమంది సాయుధులైన డచ్చి సైనికులను, మందుగుండు సామగ్రిని అత్యవసరంగా పంపవలసినది. ఇట్లు..' చదవడం ముగించి నిశ్చేష్టుడై నిలబడ్డాడు ఆ వృద్ధుడు.

భయాందోళనలతో కంపించిపోతూ కూలబడిపోయాడు గోపులు.

'ఇది మచిలీపట్టణం చేరితే ఈపాటికి మరొక రెండువేలమంది సైనికులు నాగులవంచ పొలిమేరల్లో వుండేవాళ్ళు. విజయదశమి నాటికి మేము ఆరుగురం 'పులికాట్' సరస్సులో మొసళ్ళకు బలులయే వాళ్ళం'

'దారి అడ్డగించి డచ్చి సిపాయిని కనకదుర్గమ్మకు మొదటి బలి యిచ్చి కృష్ణలో కలిపాము' రౌద్రంగా,

క్రూరంగా మెరిసినై నాగులు కళ్ళు. 'ఇక రెండవ బలి వోలందుల సమాధులకు..' అని ఆగిపోయాడు.

నాగులు చేతిలో బరిసె చటాలున మెరిసింది. కళ్ళు మూసి తెరిచేలోపు ముందు వరసలో కూర్చున్న నడివయసు వ్యక్తి గుండెల్లో దిగి వెన్నులోంచి బయటకు వచ్చింది. 'ఉ'మ్మని చిన్నగా మూలిగి పక్కకు వాలిపోయాడు అతడు.

'ద్రోహి! వోలందుల కాళ్ళు నాకే బానిస. వాళ్లకు మన సమాచారం అందించే గూఢచారి కుక్క!' కాలభైరవుడిలా కళ్ళెర్రజేసి, ప్రాణాలు కోల్పోయిన ద్రోహిని పక్కకు లాగేయండి అని సైగ చేశాడు నాగులు. మామిడితోటలో మనుషులకు, కొమ్మ కొమ్మకూ, లేత చివుళ్ళకూ ఏదో విద్యుత్తు అలుముకున్నట్లు అనిపించింది.

'ఎవరు నాతో వస్తారు? ఎవరు కామందుల్లా బతకాలనుకుంటున్నారు? ఎవరు వోలందుల కాళ్ళదగ్గర బానిస కుక్కల్లా బతకాలనుకుంటున్నారు? స్థంభాద్రి నరసింహుడి మీద ఆన! ఈ రాత్రితో వోలందుల కథ నాగులవంచ చరిత్రకే పరిమితం. నాగులు మీద, నాగులవంచ పౌరుషం మీద నమ్మకం వున్నవాళ్ళు ముందుకు రాండి! సిగ్గు, చేవ చచ్చినవాళ్ళు ఇళ్ళకెళ్ళి ముసుగులు తన్ని నిద్రపోండి!' వర్షాకాలపు మేఘంలా ఉరిమాడు నాగులు.

(కొనసాగింపు వచ్చే సంచికలో...)



COMMENTS